

ప్రతి ఇంటికీ సంఘమిత్ర సందేశం

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త
JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 3 సంచిక -90 ఆదివారం 6 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌వార్తల్లో నిజం లేదు

**: పుకార్లను కొట్టిపారేసిన కేంద్రం**

**ఆరోపణలను ఖండించిన కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ**

**ఇప్పటికే టీఎఫ్ఎల్, ఎన్‌టీపీసీల నుంచి దరఖాస్తులు వచ్చాయని వెల్లడి**

**2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ లక్ష్యం**



**ఢిల్లీ సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):**
దేశంలో కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి ఆదరణ కరవైందంటూ వస్తున్న కథనాలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. రూ. 37,500 కోట్ల ప్రోత్సాహకాలతో కూడిన ఈ పథకానికి ఒక్క దరఖాస్తు **మిగతా 2లో...**

## ఢిల్లీ పోలీసులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

**జంతర్ మంతర్ వద్ద పోలీసుల లాఠీఛార్జ్ తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది:**

**విద్యార్థులు, నిరసనకారులపై బలప్రయోగాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు**

**నిరసన తెలిపే హక్కు రాజ్యాంగబద్ధమైనదని వ్యాఖ్య**

**బాధ్యులైన అధికారుల తీరుపై నివేదిక సమర్పించాలని ఆదేశం**



**ఢిల్లీ సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):**
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నిరసనకారులపై ఢిల్లీ పోలీసులు జరిపిన తీవ్ర లాఠీఛార్జ్, బలప్రయోగాన్ని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. **మిగతా 2లో...**



## మిస్ వరల్డ్ 2026.. విజేతగా డొమినికన్ అమ్మాయి జోహెర్రీ మోలా డొమింగ్వెజ్

**వియత్నాంలో జరిగిన 73వ ప్రపంచ సుందరి పోటీలు**

**భారత్ అందాలభామ నికితా పోర్వాల్‌కు టాప్ 20లో చోటు దక్కని వైనం**

**టాప్ 40లో స్థానం సంపాదించి సరిపెట్టుకున్న నికిత**

**మలేసియా, స్పెయిన్ సుందరీలకు రన్నరప్ స్థానాలు**

**ఢిల్లీ సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):**
వియత్నాం వేదికగా అట్టహాసంగా జరిగిన 73వ మిస్ వరల్డ్ 2026 పోటీలు ముగిశాయి. ఈ ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన జోహెర్రీ మోలా డొమింగ్వెజ్ గెలుచుకుంది. స్పెయిన్‌కు**మిగతా 2లో...**

# బీఆర్ఎస్ కోటలపై దండయాత్రే




**సిరిసిల్ల, సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా పాతుతాం**

**కేసీఆర్ సభకు రా..లేదా గౌరవంగా రాజీనామా చేయి**

**నేను ఉన్నంతకాలం ఆ పార్టీని ఎదగనివ్వ..**

**వెయ్యి రోజుల ప్రగతి పాలన సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

**నకిరేకల్ లో భారీ బహిరంగ సభ**

**నల్లగొండ సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):**
'ప్రతిపక్షనేత కే చంద్రశేఖరరావు (కేసీఆర్) శాసనసభకు రాడ లేకుంటే గౌరవంగా పదవికి రాజీనామా చేయిడగజ్వేల్‌లో తేల్చుకుందాం' అని సీఎం ఏ రేవంత్‌రెడ్డి సవాలు విసిరారు. "మీరు రాయి విసిరితే.. మేము ఆ రాయితోనే సమాధానం చెబుతాండ మీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కలిసి అసెంబ్లీకి రావాలి. అక్కడే చూసుకుందాం. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, విద్య, సంక్షేమం సహా అన్ని అంశాలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో **మిగతా 2లో...**

## భవాని బోంపెల్లికి నేషనల్ టీచర్ అవార్డు

**విద్యార్థులకు సులభతర బోధన పద్దతులకు గాను వరించిన పురస్కారం**

**ఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అందజేత**

**రాజ్యాంగంలోని సమాన అవకాశాల సాకారానికి విద్యే ప్రధాన సాధనం : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ కామారెడ్డికి చెందిన ఉపాధ్యా యురాలు భవాని బొంపెల్లి ప్రతిష్టాత్మకమైన 'నేషనల్ టీచర్స్ అవార్డు–2026'ను అందుకున్నారు. చిన్నారులకు చదువును ఆనందంగా మార్చడంతో పాటు బాలికల భద్రతపై ఆమె వినూత్న పద్దతుల్లో అవగాహన కల్పిస్తోన్న ఆమెకు రాష్ట్రపతి ద్రౌపది **మిగతా 2లో...**

## ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా..

**వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: అయ్యన్నపాత్రుడు**

**రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్టు అయ్యన్న ప్రకటన**

**వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానని వెల్లడి**

**ఈ మూడేళ్ల కాలంలో తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తానన్న అయ్యన్న**

**అమరావతి సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. **మిగతా 2లో...**



## ఎస్సీ, ఎస్టీల రక్షణకు పటిష్ఠ వ్యవస్థ



**ఎస్సీ, ఎస్టీల రక్షణ, సంక్షేమంపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష**

**అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై నాలుగంచెల కార్యాచరణ ప్రణాళిక**

**ఈ ఏడాది నమోదైన 810 కేసులన్నీ పరిష్కరించామని వెల్లడి**

**2023 నుంచి బాధితులకు రూ. 15.43 కోట్ల పరిహారం అందజేత**

**రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలో విజిలెన్స్ కమిటీల ఏర్పాటు**

**అమరావతి సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) రక్షణ, సంక్షేమం, అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమలును పటిష్ఠంగా పర్యవేక్షించేందుకు రూపొందించిన నాలుగంచెల కార్యాచరణ ప్రణాళికపై అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం ఈ సమావేశం జరిగింది.ఎస్సీ, ఎస్టీ వర్గాల రక్షణ, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యాచరణను రూపొందించినట్లు **మిగతా 2లో...**

## పవన్ కల్యాణ్ ఎఫెక్ట్..

**ఆంధ్రా పేపర్ మిల్లుకు భారీ జరిమానా**

**రాజమండ్రి సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):**
రాజమండ్రిలోని ఆంధ్రా పేపర్ లిమిటెడ్ పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిబంధనలను పదేపదే ఉల్లంఘిస్తూ, పవిత్ర గోదావరి నదిని కలుషితం **మిగతా 2లో...**



## విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నాం



**. టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ**

**పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్**

**బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం**

**రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ**

**సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్**

**పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ**

**హైదరాబాద్ సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):**
విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల**మిగతా 2లో...**

## లాటరీ సీఎం ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి

**రేవంత్ ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అన్న కేటీఆర్**

**420 మోసాలకు గాను రేవంత్ 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్**

**మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని ఆరోపణ**



అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా..

**మొదటిపేజీ తరువాయి**

వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన అయ్యన్న, అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు.

మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'బీసీ ఐక్య వేదిక సదస్సు' నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# ఢిల్లీ పోలీసులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి**

జంతర్ మంతర్ ఘటనా స్థలంలో చోటుచేసుకున్న దారుణ పరిణామాలపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగబద్ధమైనదని, ప్రశాంతంగా నిరసన వ్యక్తంచేసే వారిపై పోలీసులు క్రూరంగా వ్యవహరించడం ఎంతో విచారకరం, దిగ్భ్రాంతికరం అని వ్యాఖ్యానించింది.

ఈ క్రమంలోనే పోలీసుల దాడి, పెల్లెట్ గుండ్ల ప్రయోగం, మహిళా నిరసనకారులపై జరిగిన దౌర్జన్యాలపై సమగ్ర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఐదుగురు సభ్యుల అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. శాంతియుత వాతావరణంలో విద్యార్థులు తమ సమస్యలపై నిరసన తెలుపుతుంటే పోలీసులు విచక్షణారహితంగా ప్రవర్తించడం ఎంతమాత్రం తగదని, ఈ ఘటనలో బాధ్యులైన అధికారుల తీరుపై నివేదిక సమర్పించాలని కమిటీని ఆదేశించింది. సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు, కమిటీ ఏర్పాటుతో ఢిల్లీ పోలీసు వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి నెలకొంది.

# కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్ వార్తల్లో నిజం లేదు

**మొదటిపేజీ తరువాయి**

కూడా రాలేదన్న ప్రచారాన్ని కేంద్రం తోసిపుచ్చింది. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ఇటువంటి అసత్య ప్రచారాలు ప్రాజెక్ట్‌పై ఎలాంటి ప్రభావం చూపలేవని కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.ఇప్పటికే ఈ పథకం కింద తాల్చేర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (టీఎఫ్ఎల్), ఎన్‌టీపీసీ నుంచి దరఖాస్తులు అందినట్లు వెల్లడించింది. ఈ పథకానికి సంబంధించిన తొలి విడత దరఖాస్తుల గడువు సెప్టెంబర్ 7తో ముగియనుందని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా దాదాపు 25 ప్రాజెక్టులు ఏర్పాటవుతాయని, తద్వారా సుమారు రూ. 2.5 లక్షల కోట్ల నుంచి రూ. 3 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని కేంద్రం అంచనా వేస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికి పైగా ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.ఇంధన అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశీయ బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్ ప్రక్రియ ద్వారా వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈ ఏడాది మే నెలలో ఈ ప్రతిష్ఠాత్మక పథకానికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

# ఎస్సీ, ఎస్టీల రక్షణకు పటిష్ఠ వ్యవస్థ..

**మొదటిపేజీ తరువాయి**

అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా 'ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ సెల్' ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనితో పాటు రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిల్లో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి, చట్టం అమలు తీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద 810 కేసులు నమోదు కాగా, వాటన్నింటినీ పరిష్కరించినట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఈ కేసుల విచారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రత్యేక సెషన్స్ కోర్టులు, ఒక ప్రత్యేక కోర్టు పనిచేస్తున్నాయని తెలిపారు. 2023 నుంచి 2026 ఆగస్టు వరకు 1,478 కేసుల్లో బాధితులకు రూ. 15.43 కోట్ల పరిహారాన్ని అందించినట్లు వివరించారు.

ఈ ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రులు డీబీవీ స్వామి, వి. అనిత, జి. సంధ్యారాణి, ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల ఎంపీలు కృష్ణప్రసాద్, దగ్గుమళ్ల ప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజీత్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యనార్, న్యాయశాఖ అధికారులు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడంపై కూడా సమావేశంలో చర్చించారు.

# మిస్ వరల్డ్ 2026.. విజేతగా డొమినికన్ అమ్మాయి జోహెర్రీ మోలా డొమింగ్వెజ్

**మొదటిపేజీ తరువాయి**

చెందిన ఎలిసబెత్ రెయిన్స్ మొదటి రన్నరప్‌గా, మలేసియాకు చెందిన తానూసియా చెట్టి రెండో రన్నరప్‌గా నిలిచారు. గత ఏడాది విజేత, థాయ్‌లాండ్‌కు చెందిన ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ.. కొత్త ప్రపంచ సుందరికి కిరీటాన్ని అలంకరించింది.కొత్త ప్రపంచ సుందరి జోహెర్రీ వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలు, సామాజిక కార్యకర్త. 'వాయిసెస్ ఆఫ్ టుమారో' అనే సంస్థ ద్వారా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఇంగ్లీష్ విద్యను అందిస్తున్నారు. ఆమె కమ్యూనిటీ సేవ, విద్యారంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ కిరీటం దక్కిందని పలువురు ప్రశంసిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ పోటీలకు టాంజానియా ఆతిథ్యం ఇవ్వనుంది. ఇదిలా ఉండగా, ఈ ఏడాది చివర్లో ప్యూర్టోరికోలో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరపున కాజియా లిజ్ మేజో పాల్గొననున్నారు.ఈ పోటీల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ 2024 నికితా పోర్వాల్ టాప్ 40 వరకు చేరుకుంది. అయితే, ఆ తర్వాతి రౌండ్‌లో టాప్ 20లో ఆమెకు చోటు దక్కకపోవడంతో భారత అభిమానులకు నిరాశ ఎదురైంది. అయినప్పటికీ, వరుసగా ఐదోసారి మిస్ వరల్డ్ పోటీల్లో భారత్ స్థానం దక్కించుకునే పరంపరను నికితా కొనసాగించిందని, దేశానికి గర్వకారణంగా నిలిచారని మిస్ ఇండియా ఆర్గనైజేషన్ ఓ ప్రకటనలో అభినందించింది.

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన నికితా పోర్వాల్.. గతంలో టీవీ యాంకర్‌గా పనిచేశారు. నటిగా కూడా రాణిస్తున్న ఆమె, 'చంబల్ పార్' అనే బ్రిజ్ భాషా చిత్రంలో నటించారు. ఫైనల్‌లో ఆమె ధరించిన ప్రత్యేకమైన గౌను అందరినీ ఆకట్టుకుంది.

# భవాని బోంపెల్లికి నేషనల్ టీచర్ అవార్డు

**మొదటిపేజీ తరువాయి**

ముర్ము ఈ అవార్డును అందజేశారు. మాజీ రాష్ట్రపతి సర్వే పల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగాడ శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఇందులో భాగంగా 27 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఆరు సంస్థల నుంచి మొత్తం 48 మంది టీచర్లు ఈ అవార్డులను అందుకున్నారు. కామారెడ్డి జిల్లా గాంధారిలోని ఎంపీపీఎస్ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా భవాని బొంపెల్లి సేవలందిస్తున్నారు. ప్రధానంగా చిన్నారులకు క్లిష్టమైన అంశాలను కూడా రైమ్స్, యాక్టివిటీస్, జోయ్ ఫుల్ లర్నింగ్ పద్ధతుల్లో(ప్లే అండ్ డిజిటల్) సులభంగా అర్థమయ్యేలా బోధించడం భవాని ప్రత్యేకత. ముఖ్యంగా ఆడ పిల్లల వ్యక్తిగత భద్రతకు సంబంధించిన 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్' అంశాన్ని చిన్నారులకు భయం కలిగించకుండా పాటలు, రైమ్స్‌తో అవగాహన కల్పించే ప్రయత్నం ప్రత్యేక గుర్తింపు పొందారు.గణితాన్ని, అచ్చులు-హల్లులు, ఇతర అంశాలను భవాని ఇన్నోవేషన్ పద్ధతిలో భోదిస్తున్నారు. ఎడ్యుకేషన్ వీడియోస్‌తో పాఠాలు చెప్పే ఆమె, 'యూట్యూబ్ పంతులమ్మ' గానూ గుర్తింపు పొందారు. మండల, జిల్లా స్థాయిల్లో గుర్తింపు పొందడంతో పాటు 2025లో తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని భవాని అందుకున్నారు. హైదరాబాద్ ప్రొఫెసర్ కీర్తి చంద్ర సాహు కు జాతీయ పురస్కారం తెలంగాణకు చెందిన ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ కీర్తి చంద్ర సాహు కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే మంగళగిరి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ్ బాబుకు పీడియాట్రిక్స్ విభాగంలో ఈ నేషనల్ అవార్డు వరించింది. కాగా.. నేషనల్ టీచర్స్ డే పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థలు (హెచ్ఈఐ), పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 21 మంది అధ్యాపకులను కేంద్ర విద్యాశాఖ 'జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2026 కు ఎంపిక చేసింది. ఇందులో కేంద్ర ఉన్నత విద్యాసంస్థల నుంచి 12 మంది, రాష్ట్ర విశ్వవిద్యాలయాల నుంచి ఐదుగురు (మూడు ప్రభుత్వ, రెండు ప్రయివేట్ కళాశాలలు), పాలిటెక్నిక్ కళాశాలల నుంచి నలుగురికి (రెండు ప్రభుత్వ, రెండు ప్రయివేట్ కళాశాలలు) అవార్డులు ప్రకటించింది. కాగాడ తొలుత పాఠశాల ఉపాధ్యాయులకు మాత్రమే ప్రకటించిన ఈ వార్డులనుడ 2023 తరువాత ఉన్నత విద్యాసంస్థలు, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులను ప్రోత్సహించే ఉద్దేశంతో వీటిని విస్తరించారు.

# లాటరీ సీఎం ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి

**రేవంత్ ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అన్న కేటీఆర్**

**420 మోసాలకు గాను రేవంత్ 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్**

**మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని ఆరోపణ**

**హైదరాబాద్‌సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ యువతకు స్కిల్ లేదనడానికి రేవంత్ రెడ్డికి ఏ అర్హత ఉందని, ఆయన స్వయంగా ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలపై బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో పాల్గొన్న కేటీఆర్, కేవలం లక్కీ లాటరీ తగలడం వల్లే రేవంత్ సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువశక్తికి రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# బీఆర్ఎస్ కోటలపై దండయాత్రే

**మొదటిపేజీ తరువాయి**



చర్చకు సిద్ధం" అని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలో రూ.32 కోట్లతో నిర్మించిన వంద పడకల ఏరియా ఆస్పత్రిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అక్కడే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలపై ఘాటైన విమర్శలతో రాజకీయాలను వేడి పుట్టించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేండ్లు పాలించిన బీఆర్ఎస్ అన్ని రకాలుగా రాష్ట్రాన్ని ముంచి గద్దెదిగిపోయిందని విమర్శించారు. ' బీఆర్ఎస్ కోటలపై కాంగ్రెస్ దండయాత్ర చేస్తుంది. సిరిసిల్ల, సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా పాతుతాం' అని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులో సిరిసిల్లకు వెళ్లి మూడు రంగుల జెండా ఎగురవేస్తానని, ఆ తర్వాత సిద్దిపేటపై దండయాత్ర చేస్తానని ప్రకటించారు.

బీఆర్ఎస్ నుంచి వచ్చే విమర్శలకు ఇకపై వెనక్కి తగ్గేది లేదని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని బందిపోట్లులా దోచుకున్నారని అన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు మోసపోయారని గుర్తుచేశారు. చివరి విడత రైతు భరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని చెప్పారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. 'నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు, నాకు చదువు లేకపోయినా సంస్కారం ఉంది, అందుకే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నాను' అని తెలిపారు. ఎక్కడ ఆస్తి రాసి ఇవ్వాల్సి వస్తుందోనని చెల్లెని బయటకు గెంటేశారని వ్యాఖ్యానించారు. నాలుగు ఇంగ్లీషు ముక్కలు వస్తే సరిపోదని, ఆడబిడ్డను చూసుకోవాలన్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని, ఆ పార్టీది అంతా చీకటిమయం అని అన్నారు. రేవంత్ ఉన్నంతకాలం బీఆర్ఎస్ అనే మొక్కనే ఎదగనివ్వనని అన్నారు. తెలంగాణ తులసివనంలో గంజాయి మొక్కను పీకుతామన్నారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ 90 స్థానాలు గెలిచి తిరిగి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, నియోజకవర్గాల పునర్విభజన జరిగితే 117 స్థానాల్లోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**రైతు.. మహిళ.. యువతపై ఫోకస్**

రైతు రుణమాఫీ, రైతుభరోసా, ధాన్యం కొనుగోళ్లు, సన్నవడ్ల బోనస్, ఉచిత విద్యుత్ ద్వారా రైతులకు రూ.1.70 లక్షల కోట్ల మేర ప్రయోజనం కల్పించామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలో 25.35 లక్షల మంది రైతులకు రూ.18,617 కోట్ల రుణమాఫీ చేశామని, రైతుభరోసా కింద రూ.36 వేల కోట్లు, ధాన్యం కొనుగోళ్లకు రూ.90 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రస్తావించిన సీఎం.. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రశ్నపత్రాల లీకేజీలు, నియామకాల జాప్యంతో నిరుద్యోగ యువత నష్టపోయిందని విమర్శించారు.

**'పేదలకే పదవులు'**

తమ ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. బలహీన వర్గాలకు చెందిన మహేష్‌కుమార్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా, పలువురిని ఎమ్మెల్సీలుగా నియమించామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కుటుంబ సభ్యులు, బంధువులకే పదవులు దక్కాయని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు.

**రూ.344.92 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**

ప్రగతి పాలన సభకు ముందు నకిరేకల్ పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, మరికొన్ని పనులకు శంకుస్థాపనలు చేశారు. మొత్తంగా రూ.344.92 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో ప్రధానంగా రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఏరియా ఆసుపత్రిని ప్రారంభించారు. రూ.200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, రూ.20 కోట్ల సమీకృత మండల కార్యాలయాల సముదాయం, రూ.9.85 కోట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్, రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, మున్సిపల్ కార్యాలయ భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.

## సీఎం రేవంత్ ను దూషించలేదు.. అప్పుడు అన్నది ఒకట్రెండు విషయాల్లోనే: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై అవకాశం దొరికినప్పుడల్లా విమర్శనాస్త్రాలు సంధించే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక్కసారిగా యు-టర్న్ తీసుకున్నారు. తాను రేవంత్ రెడ్డిని ఎప్పుడూ దూషించలేదని, కేవలం ఒకట్రెండు అంశాల్లో మాత్రమే అభిప్రాయ భేదాలు వచ్చాయని క్లారిటీ ఇచ్చారు.

రేవంత్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని స్పష్టం చేసిన ఆయన, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్, డిప్యూటీ సీఎం నియోజకవర్గం మధిర స్థాయిలోనే తన మునుగోడు నియోజకవర్గానికి కూడా రూ. 2 వేల కోట్ల నిధులు వచ్చాయని ప్రశంసల జల్లు కురిపించారు. త్వరలో జరగబోయే సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని చెప్పారు.

# విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నాం

**మొదటిపేజీ తరువాయి**




పదోన్నతులను పూర్తి చేశామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.

తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలను పరిష్కరించి చూపిస్తానన్నారు.

తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం చెప్పారు. సాంకేతిక విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు.విద్యాశాఖ కమిషన్ ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేయడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు.

కార్యక్రమానికి ముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

# పవన్ కల్యాణ్ ఎఫెక్ట్.. ఆంధ్రా పేపర్ మిల్లుకు భారీ జరిమానా

**మొదటిపేజీ తరువాయి**

చేస్తున్నందుకు గాను ఏకంగా రూ. 21.01 కోట్ల భారీ పర్యావరణ జరిమానా విధించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఇటీవలే మిల్లు యాజమాన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన కొన్ని రోజులకే ఈ కఠిన చర్యలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో పవన్ కల్యాణ్ ఆంధ్రా పేపర్ మిల్లు వ్యవహారశైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి నగరంలో వెలువడుతున్న మొత్తం కాలుష్యంలో దాదాపు సగం ఆంధ్రా పేపర్ మిల్లు నుంచే వస్తోందని ఆయన ఆరోపించారు. నగరం నుంచి రోజుకు 70 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు ఉత్పత్తి అవుతుండగా, ఒక్క మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు గోదావరి పరిసరాల్లోకి విడుదలవుతున్నాయని తెలిపారు. మిల్లు నుంచి విడుదలవుతున్న నీటి నమూనాలను పరీక్షించగా, బీఓడీ, ఫాస్ఫేట్లు, సల్ఫైడ్లు వంటి హానికారక రసాయనాలు నిర్దేశిత ప్రమాణాల కన్నా అత్యధికంగా ఉన్నట్లు తేలిందని వివరించారు. ఈ కాలుష్యం వల్ల గోదావరి నదిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాలకు ముప్పు వాటిల్లుతోందని, దుర్వాసనతో ప్రజారోగ్యం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు.కాలుష్యంతో పాటు పన్ను ఎగవేత అంశాన్ని కూడా పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. 2016 నుంచి సుమారు రూ. 21.34 కోట్ల బకాయిలు చెల్లించలేదని ఆయన తెలిపారు. పన్ను చెల్లింపుల నుంచి తప్పించుకునేందుకు మిల్లు యాజమాన్యం పదేపదే న్యాయస్థానాలను ఆశ్రయిస్తోందని విమర్శించారు.గడిచిన మూడు నెలలుగా పీసీబీ అధికారులు పలుమార్లు సమావేశాలు నిర్వహించినా యాజమాన్యం నుంచి స్పందన కరవైందని తెలిపారు. తక్షణమే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' లక్ష్య సాధనలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని, పద్ధతి మార్చుకోకపోతే మిల్లు కార్యకలాపాలను నిలిపివేయడం, ఆస్తులు జప్తు చేయడం, లైసెన్సు రద్దు వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తొలి విడతగా భారీ జరిమానా విధించింది. ఇకపైనా యాజమాన్యం తీరు మారకపోతే మరింత కఠినమైన చర్యలు ఎదుర్కోక తప్పదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

## నూతన వధూవరులకు రవీందర్‌రావు ఆశీస్సులు



**వర్ధన్నపేట/సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త)::** మండలంలోని రెడ్డిపాలెం క్రాస్‌రోడ్డులోని ఎఫ్ఎస్‌సీఎస్ ఫంక్షన్‌హాల్‌లో పూజారి మంజులశ్రీనివాస్‌గౌడ్ కుమార్తె. చైత్ర (సింధుజ)రంజిత్ వివాహ వేడుక శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పులి శ్రీనివాస్, అన్వర్, వెంకట్, ఎల్లగౌడ్, వెంకన్న, రాజు యాదవ్, సంపత్ యాదవ్‌తో పాటు వర్ధన్నపేటకు చెందిన పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## పాలేరు జలాశయం నుంచి సాగునీటి విడుదల

**పాలేరు/ సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):**



పాలేరు జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి చేపట్టిన ఆందోళన ఫలించింది. ఈ నెల 2న రిజర్వాయర్ వద్ద ఆయన నిర్వహించిన ధర్నా నేపథ్యంలో శనివారం నీటిపారుదల శాఖ అధికారులు సాగునీటిని విడుదల చేశారు.
వర్షాభావంతో పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో నీటి విడుదల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు ఉపేందర్‌రెడ్డి తెలిపారు. రైతుల పంటలను కాపాడేందుకు చేసిన పోరాటం ఫలించిందన్నారు. నీటిని విడుదల చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# విద్యార్థులకు బ్యాగులు..

## పాఠశాలలకు డెస్క్‌బెంచ్‌లు

**సత్తుపల్లి/ సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):**



విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడేలా సత్తుపల్లి నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కీ.శే. దాసరి వీరారెడ్డి, కీ.శే. లక్ష్మీకాంతమ్మల ఆశీస్సులతో దాసరి వెంకటరామిరెడ్డి, దాసరి రాజకుమారి సౌజన్యంతో విద్యార్థులకు బ్యాగులు, ప్రభుత్వ పాఠశాలలకు డెస్క్‌బెంచ్‌లను పంపిణీ చేశారు.గంగారం శ్రీ దాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వివిధ గ్రామాల విద్యార్థులకు బ్యాగులు అందజేయడంతో పాటు పాఠశాలలకు డెస్క్‌బెంచ్‌లు వితరణ చేశారు. రామగోవిందాపురం పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు కూడా బ్యాగులు పంపిణీ చేశారు.రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దాసరి మధుమోహన్‌రెడ్డి, రెహానా కమల్‌పాషా, దోమ ఆనంద్‌బాబు, కాకర్ల రేవతి, బెజవాడ రాధా, కావేటి అప్పారావు, మందపాటి మౌనిక నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మీసేవ కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి

### అతిక్రమిస్తే కఠిన చర్యలు ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ యుగంధర్




**కేసముద్రం/సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మహబూబాబాద్ జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ యుగంధర్ సూచించారు. శనివారం కేసముద్రం మండలంలోని పలు మీసేవ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినియోగదారుల నుంచి అధిక రుసుములు వసూలు చేయవద్దని, చెక్‌లిస్టులు, రశీదులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సేవలకు సంబంధించి ఇబ్బందులు ఉంటే మీసేవ టోల్‌ఫ్రీ నంబర్ 1100కు సంప్రదించాలని కోరారు

## నూతన వధూవరులకు అల్లం నాగేశ్వర్‌రావు ఆశీర్వాదం



**కేసముద్రం/సెప్టెంబరు 5 (జర్నలిస్టు వార్త):** కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన మెండు శేఖర్‌రెడ్డి కుమార్తె మానస, ప్రియవర్ధన్‌రెడ్డిల వివాహం శనివారం హనుమకొండలోని అభిరామ్ గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ధన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు రావుల మురళి, బండారు దయాకర్, వేముల శ్రీనివాస్‌రెడ్డితో పాటు బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్‌కు కాంగ్రెస్ నాయకుల సన్మానం




**ధర్మసాగర్ /సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను రాపాకపల్లి 5వ వార్డు సభ్యుడు ఇమ్మడి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల శాఖ సమన్వయ కమిటీ సభ్యుడు వక్కల రవీందర్, మండల కోఆర్డినేటర్ బిక్షపతి, కాంగ్రెస్ కాంటెస్ట్ సర్పంచ్ కందుకూరి సుధాకర్, అడిగొప్పుల మల్లేశం, మాజీ వార్డు సభ్యులు కందుకూరి శ్రీధర్, ఇమ్మడి కృష్ణంరాజు, ఇమ్మడి సునీల్, కందుకూరి కరుణాకర్, యూత్ నాయకుడు కందుకూరి కరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సూరారానికి బస్సు సౌకర్యం..

### మాట నిలబెట్టుకున్న మంత్రి పొన్నం




**ఎల్కతుర్తి/ సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):**ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ ఏర్పాటుకు శనివారం ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రజాపాలనలో భాగంగా గ్రామాన్ని సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గ్రామస్థులు బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.మంత్రి హామీ ఇచ్చిన నాలుగు రోజుల్లోనే హనుమకొండ నుంచి సూరారానికి లోకల్ బస్సు సర్వీస్ ట్రయల్‌గా ప్రారంభం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ లోకల్ బస్ డిపో డీఎం ధర్మసింగ్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాషబోయిన నీల, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బచ్చు శ్రీధర్‌రావు, ఉపసర్పంచ్ బాబు, మాజీ ఎంపీటీసీ పిట్టల మహేందర్, మొలుగూరి భాస్కర్, వార్డు సభ్యులు జాబీద్, ఎర్రబెల్లి వెంకట్రావు, కుర్ర ప్రకాశ్, చల్లూరి వేణు, చికెన్ సంపత్, కుమార్, మైళలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ రణభేరి

### విద్యార్థులు, నిరుద్యోగులతో సండ్ర భారీ ర్యాలీ






**సత్తుపల్లి/సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తయినా యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా సత్తుపల్లిలో విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఆర్అండ్‌బీ అతిథిగృహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అనంతరం నిర్వహించిన సభలో సండ్ర మాట్లాడుతూ.. 100 రోజుల్లో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు గడిచినా హామీ నెరవేర్చలేదన్నారు. నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, విద్యా భరోసా కార్డుల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. యువతకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోతే విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సండ్ర హెచ్చరించారు.

## 22-ఏ భూములపై న్యాయ విచారణ జరపాలి



**బయ్యారం/సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ వార్త);**22-ఏ నిషేధిత భూముల రికార్డుల్లో అవకతవకలపై సమగ్ర న్యాయ విచారణ జరిపి, శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. భూ భారతి సమస్యలపై హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద బీజేపీ చేపట్టిన మహాధర్నాకు ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం తరలివెళ్లారు. ఆధారాలు లేకుండా భూములను 22-ఏ జాబితాలో చేర్చడంతో రైతులు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ బోనాలకు ఏర్పాట్లు పూర్తి



**బయ్యారం/సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయంలో బోనాల పండుగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం బయ్యారం, జగ్గుతండా సర్పంచులు గుగులోత్ శాంతి కిషన్‌నాయక్, బొల్లి జయంతి వెంకటకృష్ణ ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. బోనాల వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నేటి నుండి ప్రతి ఆదివారం ఎరువుల దుకాణాలు బంద్.

### -బయ్యారం ఫర్టిలైజర్ అసోసియేషన్.

**బయ్యారం/,సెప్టెంబర్ 5.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండల వ్యాప్తంగా ఉన్న పురుగు మందుల,ఎరువులు దుకాణాలు ప్రతి ఆదివారం పూర్తిగా బంద్ (సెలవు) ఉంటాయని బయ్యారం మండల ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు సూరం సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.రైతులకు అవసరం అయిన ఎరువులు,విత్తనాలు సోమవారం నుండి శనివారం వరకు కొనుగోలు చేసుకోవాలని తెలిపారు.అదేవిధంగా రైతులు ఎరువులు బుకింగ్ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.యూరియా మాత్రమే కాకుండా డీఏపీ,తదితర కాంప్లెక్స్ ఎరువులను ఈ యాప్ ద్వారా కొనుగోలు చేయవచ్చు.యాప్‌ను ఉపయోగించి ఎరువులు కొనుగోలు చేయడానికి తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.రైతులు విత్తనాల కొనుగోలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోకపోతే,మీరు సన్న వరి పండించినప్పటికీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 500 బోనస్ లభించదు.కాబట్టి ఆలస్యం చేయకుండా సెప్టెంబర్ 10 లోపు మీరు విత్తనాలు కొన్న డీలర్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూరం సుధాకర్ రెడ్డి రైతులకు తెలియజేశారు.

# ఎరువుల విక్రయ కేంద్రాల్లో తనిఖీ



**బయ్యార/సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కొత్తపేట, బయ్యారం గ్రామాల్లో ఎరువుల విక్రయ కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయచంద్ర శనివారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, విక్రయాల రికార్డులను పరిశీలించి, డీలర్లు నిబంధనల మేరకు రికార్డులు నిర్వహించాలని సూచించారు. అనంతరం సంతులాల్‌పోడు తండా, బయ్యారం గ్రామాల్లో పెసర



పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేసే పంటలకు ప్రాధాన్యమిస్తూ పంటల వైవిధ్యీకరణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే.రాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



**సత్తుపల్లి/సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి డివిజన్‌లోని మూడు ప్రైవేట్ పాఠశాలలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్, డీఈఓ సదానందం అవార్డులను ప్రదానం చేశారు. సత్తుపల్లిలోని కేపీఆర్ గౌతమ్ మోడల్ స్కూల్ నిర్వాహకుడు మందపాటి ప్రభాకర్‌రెడ్డి, విశ్వశాంతి విద్యాలయం నిర్వాహకుడు పసుపులేటి నాయనేశ్వరరావు, కల్లూరులోని బాలాజీ స్కూల్ నిర్వాహకుడు వలసాల బాలాజీ అవార్డులు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను అధికారులు శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు.

# కొవ్వాడ అణుపార్క్ రద్దు చేయాలి

### రైతుల భూములు తిరిగి ఇవ్వాలి



**శ్రీకాకుళం/ సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** కొవ్వాడ అణుపార్క్‌ను రద్దు చేసి, రైతుల నుంచి తీసుకున్న భూములను తిరిగి ఇవ్వాలని ఆంధ్ర ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ సీనియర్ నాయకుడు చాపర సుందరలాల్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సనపల అన్నాజీరావు డిమాండ్ చేశారు. శనివారం శ్రీకాకుళంలోని ఎన్జీవో హోంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.కొవ్వాడలో అణుపార్క్ ఏర్పాటుతో ప్రమాదాలు సంభవిస్తే ప్రజల ప్రాణాలతో పాటు భూమి, నీరు, గాలి కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూములను తీసుకుని జనసాంద్రత ఉన్న ప్రాంతంలో అణుపార్క్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. అణువిద్యుత్ కంటే సౌర, పవన విద్యుత్ వంటి ప్రత్యామ్నాయ వనరులతో చౌకగా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని పేర్కొన్నారు.కొవ్వాడ, కోటపాలెం, రామచంద్రాపురం గ్రామాల ప్రజల ఉపాధి, జీవన భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని కోరారు. జిల్లాలో మత్స్యకారులకు జెట్టీలు, ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేయాలని, కార్గో విమానాశ్రయ ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గోలివి అప్పలనాయుడు, సీహెచ్ అమ్మన్నాయుడు, చింతపల్లి సూర్యనారాయణ, కొమర మున్నా, ఎం.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు



**ఎల్కతుర్తి/సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని జిలుగుల గ్రామ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డికి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డును గ్రామ ప్రజలు, విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.అలాగే మోడల్ కాలేజీ, పాఠశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ఇంజం శివకుమార్, ఒకేషనల్ విభాగానికి చెందిన రామరాజు, కెమిస్ట్రీ అధ్యాపకులకు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు రావడంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తిరుపతితో పాటు పలువురు పాల్గొన్నారు.

## డాన్‌బోస్కో పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**తల్లాడ/ సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం పినపాకలోని డాన్‌బోస్కో పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫాదర్లు వై. ప్రదీప్‌రెడ్డి, రాజేష్, చంద్రమోహన్, సునీల్, సిస్టర్ కమల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, మదర్ తెరిసా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బోధన, బోధనేతర సిబ్బందిని సన్మానించి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ ప్రదీప్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో సిబ్బంది పాత్ర కీలకమన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాంత్రికుడు రవి ప్రదర్శించిన మేజిక్ షో అలరించింది. సిబ్బందికి పాఠశాల యాజమాన్యం కృతజ్ఞత విందు ఏర్పాటు చేసింది.

# గురువులకు ఘన సన్మానం

### 23 మంది ఉపాధ్యాయులకు కిట్స్ వాకర్స్ అసోసియేషన్ సత్కారం



**హసన్‌పర్తి/ సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** గురువు సమాజానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి అని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొక్క కుమార్ అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 23 మంది ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా బొక్క కుమార్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో 'మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ'కు విశిష్ట స్థానం ఉందన్నారు. తల్లి జన్మనిస్తే.. తండ్రి నడక నేర్పుతారని, గురువు మాత్రం జీవితంలో ఎలా నడవాలో నేర్పిస్తారని పేర్కొన్నారు. గురువు చెప్పే ఒక్క మంచి మాట విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేస్తుందని, ఆయన చూపే సరైన మార్గం కుటుంబాన్ని, సమాజాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని అన్నారు.వైద్యులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, నాయకులు ఇలా అన్ని రంగాల్లో నిపుణులను తయారు చేసేది ఉపాధ్యాయులేనని తెలిపారు. గురువును సన్మానించడం అంటే జ్ఞానం, విద్య, విలువలను గౌరవించడమేనన్నారు. దేశ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత పిల్లల జీవితాలను తీర్చిదిద్దే గురువులకు ప్రతి ఒక్కరూ కృతజ్ఞతతో ఉండాలని అన్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో ఉపాధ్యాయుల పట్ల గౌరవం తగ్గడం ఆందోళనకరమన్నారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవడం సమాజానికి చేటు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువులను గౌరవించే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు.
అనంతరం 23 మంది ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

# సన్న రకాలకు రూ.500 బోనస్

### సెప్టెంబరు 10లోగా విత్తన వివరాల నమోదు



**కేసముద్రం/సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** సన్న రకాల వరి సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. రైతులు విత్తన వివరాలను సెప్టెంబరు 10లోగా సీడ్ సెల్ యాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్న సూచించారు. శనివారం మండలంలోని విత్తన దుకాణాలను అధికారులు తనిఖీ చేసి రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. విత్తనం సొంతంగా సమకూర్చుకున్న రైతులు కూడా క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్, పట్టాదారు పాస్‌బుక్, విత్తన కొనుగోలు బిల్లు తదితర పత్రాలు అవసరమని తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర, బోనస్ పొందేందుకు డిజిటల్ పంట నమోదు తప్పనిసరని స్పష్టం చేశారు.

# యూనివర్సల్ విద్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం





**తల్లాడ/సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడలోని యూనివర్సల్ విద్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలు పోషిస్తూ 'సెల్ఫ్ గవర్నమెంట్ సెలబ్రేషన్స్' నిర్వహించారు. విద్యార్థులే తరగతుల్లో బోధిస్తూ ఉపాధ్యాయుల బాధ్యతలను అనుభవించారు. ఈ కార్యక్రమం వారిలో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా సాగింది.విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది.ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను బెస్ట్ టీచర్ అవార్డులతో సత్కరించారు. ప్రీ ప్రైమరీ విభాగంలో రమ్య, ప్రైమరీ విభాగంలో సమత, హైస్కూల్ విభాగంలో యాకోబ్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారికి శాలువాలు కప్పి సత్కరించారు.
విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో కరెస్పాండెంట్ పీకే ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ఘన సన్మానం




**తల్లాడ/సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):**తల్లాడ మండలంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 18 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కర్నాటి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. చీకటిని తొలగించి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే గురువులను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పాఠశాలకు మంచి ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్ది గ్రామానికి, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్‌సీ వేమిరెడ్డి వెంకట్‌నారాయణరెడ్డి, మాజీ జడ్‌సీ బెల్లంకొండ ఆంజనేయులు, కార్యదర్శి గులివిందల సుధానాయుడు, కోశాధికారి చల్లా రామయ్య, సభ్యులు యాచవరపు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం

### శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం







**కేసముద్రం/ సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ అన్నారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్, ప్రిన్సిపాల్ చిర్ర నరేశ్ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో యాకాంతం గౌడ్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో విలువైనవన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు నైతిక విలువలను అందించాలని సూచించారు.
విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపి కృతజ్ఞతాభావాన్ని చాటుకున్నారు. ఉపాధ్యాయుల సన్మానంతో పాఠశాలలో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురువులు భగవంతుని ప్రతిరూపాలు

**వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు**



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** తల్లిదండ్రుల తర్వాత సమాజంలో గురువులకే అత్యున్నత స్థానం ఉందని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. తల్లిదండ్రులు జన్మనిచ్చి పెంచి పెద్ద చేస్తే.. ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చి, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. గురువులు భగవంతుని ప్రతిరూపాలని కొనియాడారు.హసన్‌పర్తిలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గురుపూజోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు నాగమల్ల మాధవశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేశ్వర్‌రావు హాజరయ్యారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు, మేధావులను తయారు చేసేది ఉపాధ్యాయులేనన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.అనంతరం జెడ్పీహెచ్ఎస్ బాలుర ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, జెడ్పీహెచ్ఎస్ బాలికల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునితలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు అప్పని రమేశ్, వెలగందుల భీష్మనాథం, మంచెన శ్యాంసుందర్, భూపతి కృష్ణమూర్తి, సంద్రు నాగేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ద

# కూడా చైర్‌పర్సన్‌కు ఎమ్మెల్యే నాగరాజు శుభాకాంక్షలు



**హసన్‌పర్తి/సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. వరంగల్ నగరంతో పాటు కూడా పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ మౌలిక వసతుల కల్పన, పట్టణ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేయాలని అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ అధ్యక్షుడు కర్ర హరీష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జన్ను శిభారాణి అనిల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుద్దె పెద్దన్న, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

**హసన్‌పర్తిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**13 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం**



**హసన్‌పర్తి/సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):**ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హసన్‌పర్తి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన వేడుకల్లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు వారి ప్రవర్తన, ప్రతిభను ఎప్పటికప్పుడు గమనిస్తూ భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కూడా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని కొనియాడారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హసన్‌పర్తి సీఐ ఆకునూరి మహేందర్ మాట్లాడుతూ.. తాను ఈ స్థాయికి ఎదగడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని పేర్కొన్నారు.అనంతరం మండలంలోని 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు రమాదేవి, సంపత్, రవికుమార్, రవీందర్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు మధుకర్‌రెడ్డి, నరేష్, శ్రీనివాస్, పొన్నం చందర్, శ్రీ వర్ధన్‌రెడ్డితోపాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ బోనాలకు ఏర్పాట్లు పూర్తి



**బయ్యారం/సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయంలో బోనాల పండుగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం బయ్యారం, జగ్గుతండా సర్పంచులు గుగులోత్ శాంతి కిషన్‌నాయక్, బొల్లి జయంతి వెంకటకృష్ణ ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. బోనాల వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పాఠశాలలో సర్వేపల్లి కాంస్య విగ్రహం ఆవిష్కరణ

**విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి: ఎమ్మెల్యే నాగరాజు**






**హసన్‌పర్తి/ సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కాంస్య విగ్రహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శనివారం ఆవిష్కరించారు. హసన్‌పర్తి మండలం 3వ డివిజన్ పైడిపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. గొప్ప ఉపాధ్యాయుడిగా, విద్యావేత్తగా, తత్వవేత్తగా ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు.

ఒక గొప్ప ఉపాధ్యాయుడు దేశాన్ని మార్చగల శక్తిని కలిగి ఉంటాడని రాధాకృష్ణన్ జీవితం చాటిచెప్పిందన్నారు. విద్యార్థులు లక్ష్య సాధనకు క్రమశిక్షణ, పట్టుదల, కృషిని అలవర్చుకోవాలని సూచించారు. సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, భావితరాలకు వారు మార్గదర్శకులుగా నిలుస్తారని అన్నారు.

అనంతరం ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జన్ను శిభారాణి అనిల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుద్ధ పెద్దన్న, సీనియర్ నాయకులు బిజిలి సంపత్, డివిజన్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వంటావార్పునకు ప్రజల మద్దతు లేదు

**నిరసనలను ప్రజలు పట్టించుకోవడం లేదు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**హసన్‌పర్తి/సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ చేపడుతున్న వంటావార్పు నిరసనలకు ప్రజల మద్దతు లేదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల వరకే ఆ నిరసనలు పరిమితమయ్యాయని, ప్రజలు వాటిని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మహిళల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. మహిళలకు అనుకూలమైన పార్టీ కాంగ్రెస్ అని, భవిష్యత్తులోనూ వారి అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. మహిళల అభివృద్ధి గురించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ గతంలో తన మంత్రివర్గంలో మహిళలకు స్థానం కల్పించలేదని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలకు తెలుసన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ వెయ్యి రోజుల పాలన పేరుతో నిరసనలు చేపడుతోందని విమర్శించారు.



**వంద పడకల ఆసుపత్రి పట్టణంలోనే..**

వర్ధన్నపేటలో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 100 పడకల ఆసుపత్రిని వర్ధన్నపేట పట్టణంలోనే నిర్మిస్తామని తెలిపారు.

ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఆరు గ్యారంటీలను అమలు చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన పరిణామాలను ప్రజలు గుర్తించారని, ఆ పార్టీని తిరిగి అధికారంలోకి రానివ్వకుండా ప్రజలే అడ్డుకుంటారని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా నిరంతరం ప్రజల మధ్య ఉంటున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సోనియాగాంధీ ప్రజల అభివృద్ధి కోసమే ప్రకటించారని, అయితే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందిందని విమర్శించారు.

బీఆర్ఎస్ నిరసనలను ప్రజలు నమ్మవద్దని, వాటిని పట్టించుకోవద్దని, ఆ నిరసనలను ఒక నాటకంలా చూడాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు విజ్ఞప్తి చేశారు.

# ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం







**వర్ధన్నపేట/సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి శనివారం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని




పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతుల అభివృద్ధికి మున్సిపాలిటీ తరఫున సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి-రాజేందర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్, కౌన్సిలర్ బెజ్జం పాపారావు, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి సుజాత, నాయకులు పాలకుర్తి శ్రీకాంత్, మాలోతు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.

**బయ్యారం/,సెప్టెంబర్ 5.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండల కేంద్రంలోని జెడ్పి హెచ్ ఎస్ బయ్యారం (బాలుర) పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి,వారి పట్ల తమకున్న గౌరవాభిమానాలను చాటుకున్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే,ఉపాధ్యాయులు వారికి జ్ఞానాన్ని అందించి జీవితానికి సరైన దిశానిర్దేశం చేస్తారని అన్నారు .మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అనే సూక్తిలో



గురువుకు ఉన్న విశిష్ట స్థానాన్ని గుర్తించవచ్చున్నారు. అజ్ఞానాంధకారం నుంచి జ్ఞానమార్గంలోకి నడిపించే గురువు విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే మార్గదర్శి అని పేర్కొన్నారు.విద్యార్థులు తమ గురువులకు చేసిన సన్మానం చిరస్మరణీయంగా నిలిచిందని అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి కలకోట నారాయణరావు క్రీడాకారులైన విద్యార్థులకు రూ.25 వేల విలువైన టీ-షర్టులను అందజేశారు.పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, ఎంపీడీవో దీపిక విద్యార్థులను ఉద్దేశించి చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సీఐ రవీందర్, ప్రధానోపాధ్యాయులు ఎం.ధనంజయ, ఉపాధ్యాయులు ఇ.లక్ష్మీనారాయణ, ఎంవి. రామేశ్వరరావు, జి.దస్తగిరి, బి. రవీందర్, కొలిపాక శ్రీనివాస్, బి.లక్ష్మయ్య, పి. అరుణశోభ, బి.హాథిరాం, ఆర్.వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసరావు, కె.సునీత, కళావతి, ఎస్.వి.సర్వేశ్వర్, నజీమా,సైదాబీ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చలో అమరావతికి తరలిరావాలి

## అక్టోబరు 7న ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ జాతీయ మహాసభ -బిర్రు మహేందర్ మాదిగ

**ఆత్మకూరు/సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ వార్త);** అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం అక్టోబరు 7న అమరావతిలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. ఆత్మకూరు(ఎం)లో శనివారం నిర్వహించిన మండలస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక, ఆర్థిక అసమానతలపై భవిష్యత్ ఉద్యమానికి ప్రజలను సిద్ధం చేయాలని ఎమ్మెస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్ల చంద్రస్వామి మాదిగ కోరారు.

అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మామిడి అనిల్ మాదిగ, ఎంఎస్పీ అధ్యక్షుడిగా జిట్టా యాదగిరి మాదిగ, మాదిగ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా గురుకు సంతోష మాదిగ, మాదిగ విద్యార్థి



సమాఖ్య అధ్యక్షుడిగా గాదె మనోజ్ మాదిగ, పట్టణ అధ్యక్షుడిగా ఇంజమూరి నరేష్ మాదిగ ఎన్నికయ్యారు. మాదిగ ఉద్యోగ సమాఖ్య బాధ్యులుగా వేముల నర్సింహ్మ మాదిగ, మేడి రామ్ లక్ష్మణ్ మాదిగ, సామాజిక మాధ్యమాల సమన్వయకర్తగా బద్దుల మనోజ్ మాదిగ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో గడ్డం ముత్తమ్మ, కానుకుంట్ల యాదగిరి మాదిగ, సుంకిశాల ఎల్లయ్య మాదిగ, వస్తుపుల జంగులు మాదిగ, గట్టు శేఖర్ మాదిగ, గట్టు రాజు మాదిగ, కొంగరి విద్యాసాగర్ మాదిగ, వేముల గణేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# 50 మంది కొత్త విద్యార్థుల నమోదు

## మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ధారావత్ నెహ్రూ



**కేసముద్రం/సెప్టెంబరు 5 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచి విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచిన ఉప్పరపల్లి ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు ధారావత్ నెహ్రూ మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో 23 మంది విద్యార్థులు ఉండగా.నెహ్రూ ప్రత్యేక చొరవతో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 73 మందికి చేరింది. ఒక్క ఏడాదిలోనే 50 మంది కొత్త విద్యార్థులు పాఠశాలలో చేరడం విశేషం.విద్యార్థుల నమోదును పెంచేందుకు గ్రామంలో పర్యటించి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తూ.సమగ్ర అభివృద్ధికి కృషి చేశారు.నెహ్రూ సేవలను గుర్తించిన విద్యాశాఖ అధికారులు ఆయనను మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.

---

# ప్రతి ఇంటికీ సంఘమిత్ర సందేశం

## మత్తు పదార్థాల నిర్మూలనలో మహిళా సంఘాలే కీలకం -1.17 లక్షల మంది సభ్యుల ద్వారా కుటుంబాలకు అవగాహన













**హన్మకొండ బ్యూరో/సెప్టెంబరు 5(జర్నలిస్ట్ వార్త);** మత్తు పదార్థాలు, గంజాయి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో సంఘమిత్ర కార్యక్రమాన్ని శనివారం హన్మకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామ దీపికలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థల సభ్యుల ద్వారా జిల్లాలోని ప్రతి కుటుంబానికి మత్తు పదార్థాల వ్యతిరేక సందేశాన్ని చేరవేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

ప్రతి తల్లి బాధ్యత తీసుకోవాలి

మత్తు పదార్థాల సమస్య పోలీసు శాఖకు మాత్రమే పరిమితం కాదని, సమాజం మొత్తం కలసి ఎదుర్కోవాల్సిన సమస్య అని జిల్లా కలెక్టర్ డా. సత్యశారద అన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. ప్రతి మహిళా సంఘం సభ్యురాలు తన పరిధిలో సంఘమిత్ర గా పనిచేసి మత్తు పదార్థాల దుష్పరిణామాలను కుటుంబాలకు వివరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత కోరారు.

సమాచారం ఇవ్వండి.. గోప్యంగా ఉంచుతాం

మత్తు పదార్థాల విక్రయం, సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని తూర్పు విభాగం ఉప పోలీసు కమిషనర్ అంకిత్‌కుమార్ కోరారు. సమాచారదాతల వివరాలను గోప్యంగా ఉంచుతామని, విలువైన సమాచారం అందించిన వారికి తగిన పారితోషికం అందిస్తామని తెలిపారు. మత్తుకు బానిసైన వారిని వెలివేయకుండా వైద్య చికిత్స, మానసిక సలహా, కుటుంబ సహకారం అందించాలని సూచించారు.

విద్యార్థుల అవగాహన నాటిక

కార్యక్రమంలో విద్యార్థినులు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన నాటిక ప్రదర్శించారు. మత్తు నుంచి బయటపడిన ఓ వ్యక్తి తన అనుభవాలను వివరించి యువతకు సందేశమిచ్చారు. ప్రత్యేక చిత్రాల ద్వారా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

ప్రతి తల్లి చైతన్యవంతమైతే. ప్రతి కుటుంబం సురక్షితం. ప్రతి కుటుంబం చైతన్యవంతమైతే. మత్తు పదార్థాలు లేని సమాజం సాధ్యం అనే నినాదంతో సంఘమిత్ర కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి.గణేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి నాగపద్మజ, జిల్లా వైద్యాధికారి రాజిరెడ్డి, అదనపు ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, మామునూరు సహాయ పోలీసు కమిషనర్ వెంకటేష్, గీసుకొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, మానసిక వైద్య నిపుణుడు డా.భరత్, జిల్లా సమైక్య సంఘం అధ్యక్షురాలు రజిత, తెలంగాణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, వెయ్యికిపైగా సభ్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.














